క్లుప్తంగా

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

పిట్టలవానిపాలెం: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని పిట్టువారిపాలెం గ్రామ సచివాలయ మహిళా ఆరోగ్య కార్యకర్త నాగమణి తెలిపారు. పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నతపాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు బుడ్డా నాగాంజనేయులు ఉన్నారు.

9న కోనేటిపురంలో నాగదేవత జయంతి

కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురంలోని వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో నాగదేవత 59వ జయంతి వార్షిక మహోత్సవాలు ఈనెల 9న నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు బాలస్వామి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు నాగదేవతకు అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని మధ్యాహ్నం అన్న ప్రసాదం పంపిణీ జరుగుతుందని ఆస్థాన పండితులు వంగర చలమయ్య తెలిపారు.

మట్టి ప్రతిమల పంపిణీ



బాపట్ల: మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని బాపట్ల జిల్లా అటవీశాఖ అధికారి ఎల్.భీమయ్య పిలుపునిచ్చారు. స్థానిక చంద్రబాబునాయుడు కళాక్షేత్రంలో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శ్రావణం చంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ అధ్యక్షులు బి.ఎస్.నారాయణ భట్టు, ఐటీసీ సేఫ్టీ అధికారి ఎం.ఎస్.ఎస్.రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఎ.ఇ.రామ కోటయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

- శ్రీసంపత్ గణపతి పరివార్ ఆధ్వర్యంలో బాపట్ల భావనారాయణ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు బాబూ నాగేంద్ర తెలియజేశారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్ కుమార్, బాబురెడ్డి, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.
- బాపట్ల మహిళా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు బాపట్ల రెడ్ క్రాస్ సహకారంతో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఐ.హరిత, జాతీయ సేవా పథకం విభాగాధిపతులు కె.కృష్ణకుమారి, జి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

ఐలవరం(భట్టిప్రోలు): వినాయకచవితి పురస్కరించుకుని శనివారం శ్రీదేవి యూత్ దసరా నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం ఐలవరంలో 1,116 మట్టి వినాయకుని విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఐలవరంలోని గణేష్ మండపాల వద్ద వీటిని భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు

వేమూరు: వేమూరు అంబేడ్కర్ నగర్ చెందిన పాముల శ్రీనివాసరరావును అదే గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ భర్త సజ్జా శ్రీనివాసరరావు కొట్టి కులం పేరుతో దూషించారని బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవి కృష్ణ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. ఈనెల 3న ఓ మహిళ నిర్వహిస్తున్న హోటల్‌కు వెళ్లిన పాముల శ్రీనివాసరావు మీరు చేస్తున్న టిఫిన్ చాలా బాగుందని, ఎలా చేస్తారని ప్రశ్నించాడు. దీంతో ఆమె గ్రామ సర్పంచ్ భర్తకు విషయం చెప్పింది. ఆగ్రహానికి గురైన సర్పంచ్ భర్త అదేరోజు రాత్రి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి కులం పేరుతో దూషించాడు. ఆ తర్వాత తాను మాట్లాడినదంతా రికార్డు చేశావా? ఫోన్ తీసుకుని ఇంటికి రా అంటూ ఆదేశించాడు. శ్రీనివాసరావు ఇంటికి వెళ్లగా అతడిని సర్పంచ్ భర్త తీవ్రంగా కొట్టాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు. రేపల్లె డీఎస్పీ విచారణ చేస్తారని వెల్లడించారు.

'ఘన' పతింభజే



చెరుకుపల్లిలో భారీ వినాయక విగ్రహాన్ని క్రేన్ సాయంతో ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం



చెరుకుపల్లిలో కిటకిటలాడుతున్న పూలు, పండ్ల దుకాణాలు

వినాయక చవితి సందర్భంగా కోలాహలం నెలకొంది. మార్కెట్లు కళకళలాడుతున్నాయి. శనివారం గణపతిని కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఊరూవాడా చలువ పందిళ్లు, మంటపాలు వెలుస్తున్నాయి. పత్రి, పూజా సామగ్రి, గణేశుని విగ్రహాలు, కొత్త వస్త్రాలు కొనుగోలు చేసే భక్తులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. – చెరుకుపల్లి/రేపల్లె రూరల్



రేపల్లె పట్టణం తాలూకా సెంటరులో నెలకొల్పిన గణేశుడి విగ్రహం

ప్రకృతి మహాలక్ష్మీ నమోస్తుతే



చందోలు బగళాముఖి అమ్మ ఆలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన నిర్వహించారు. అమ్మవారిని ప్రకృతి మహాలక్ష్మిగా అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. – పిట్టలవానిపాలెం

మేట వన్నె కష్టం

- వరద వీడినా ఆగని కన్నీళ్లు
- ఇళ్లల్లో పేరుకున్న మట్టిమేటలు
- పంటలు సర్వనాశనం
- బాధితుల హాహాకారాలు
- సవ్యంగా సాగని సహాయక చర్యలు

లంకల్లో వరద వీడినా కష్టాలు తప్పడం లేదు. కన్నీళ్లు ఆగడం లేదు. ఇళ్లల్లో, పొలాల్లో మట్టిమేటలు పేరుకుపోయాయి. పంటలు సర్వ నాశనమయ్యాయి. ఆహారం, నీళ్లు అందక బాధితులు హాహాకారాలు చేస్తున్నారు. సహాయక చర్యలు సవ్యంగా సాగడం లేదు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందించే ఆహారపదార్థాలతో బాధితులు కాలం వెళ్లదీస్తున్నారు. భట్టిప్రోలు మండలం చింతమోటు గౌడపాలెంలోని శ్మశానవాటికకు వెళ్లే రహదారి మార్గంలో నీరు నిలిచిపోయింది. పెసర్లంక జెడ్పీ హైస్కూల్, వరద ప్రభావిత గ్రామాలైన చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు పల్లెపాలెం గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాలల్లో మట్టి మేట వేసింది. వీటిని శుభ్రం చేసే పనిలో ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది నిమగ్నమయ్యారు. పంటలు ఇంకా నీటిలోనే మగ్గుతున్నాయి. మట్టి మేటల వల్ల మాడిపోయి కనిపిస్తున్నాయి. లంకలు బురదమయమయ్యాయి. దుర్గంధం వెదజల్లుతున్నాయి. పంచాయతీల సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. -భట్టిప్రోలు/కొల్లూరు



కొల్లూరు మండలం గాజుల్లంక వద్ద నల్లగా మాడిపోయిన అరటి మొక్కలు



కొల్లూరు మండలం చింతర్లంక వద్ద ఇసుక మేటతో పనికిరాకుండా పోయిన బంతి పూల తోట



కొల్లూరు మండలం కృష్ణా నది ఒడ్డున బుసక మేటలో పసుపు పంట



చింతమోటు గౌడ కాలనీలో శ్మశాన వాటికకు వెళ్లే దారిలో వరద నీరు

కిచెన్ షెడ్ విస్తరణకు శంకుస్థాపన



వేమూరు(అమర్తలూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిచెన్ షెడ్ విస్తరణకు అక్కడే పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు దర్బా భ్రమర సూర్యశ్రీ రూ.60 వేలు విరాళం ఇచ్చారని ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు తెలిపారు. సూర్యశ్రీ ఇక్కడే చదువుకున్నారని, ఏడాదిగా ఇక్కడే పనిచేస్తున్నారని వివరించారు. ఆమె తల్లిదండ్రులు, మేనమామ స్మారకార్థంగా విరాళం ఇచ్చినట్టు చెప్పారు. శుక్రవారం పనులకు శంకుస్థాపన చేసినట్టు వివరించారు.

రేపు భట్టిప్రోలులో రుషి పంచమి

భట్టిప్రోలు: సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఈనెల 8న రుషి పంచమి వేడుకలు నిర్వహించనున్నట్లు సాధన మండలి నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం ఆధ్యాత్మికవేత్తలైన వారిని సప్త రుషులుగా భావించి పూజలు చేయనున్నట్లు వివరించారు.

చురుగ్గా వరద నష్ట నమోదు



భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో పంట నష్ట నమోదు ప్రక్రియను చేపట్టిన అధికారులు



కొల్లూరు మండలం పెసర్లంకలో గృహ నష్ట నమోదు చేస్తున్న సిబ్బంది

లంక గ్రామాల్లో వరదల వల్ల దెబ్బతిన్న గృహాలు, పంటల నష్ట నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. అధికారులు బృందాలుగా ఏర్పడి వేగంగా జాబితాలు తయారు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో మరో రెండురోజులపాటు నష్ట నమోదు ప్రక్రియ సాగుతుందని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. చెరుకుపల్లి మండలంలో తహసీల్దార్ పద్మావతి, వ్యవసాయ అధికారి టి.బాలాజీ ఆధ్వర్యంలో నష్ట నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. నష్టనమోదుపై శుక్రవారం అధికారులకు అవగాహన కల్పించారు. కొల్లూరు మండలంలోనూ నష్ట నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. – భట్టిప్రోలు/చెరుకుపల్లి/ కొల్లూరు



చెరుకుపల్లిలో నష్టం నమోదుపై సూచనలు చేస్తున్న ఏఓ బాలాజీ చిత్రంలో తహసీల్దార్ పద్మావతి

కట్టుబట్టలతో మిగిలాం



వరదలకు పిల్ల పుస్తకాలు, బ్యాగ్‌లు అన్నీ తడిచిపోయాయి. సర్టిఫికెట్లు కూడా నానిపోయాయి. వీటి కోసం ఇప్పుడు ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లు పడిపోయాయి. సామగ్రి తీవ్రంగా దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో మిగిలాం.

– ఐనంపూడి బాల బాలభాస్కరరావు, పెదలంక, భట్టిప్రోలు మండలం

బడ్డీ కొట్టుకుపోయింది



ఇంటికి మగ దిక్కు లేకపోవడంతో ఆదరువుగా ఉంటుందని బడ్డీకొట్టు పెట్టుకున్నాను. అది కాస్త వరదకు ఎటో కొట్టుకుపోయింది. ఇంట్లోని సామగ్రి వరద పాలయ్యాయి. ఇంకా మా ఇళ్లల్లో నీరు పోలేదు.

– దోవా కుమారి, పెదలంక, భట్టిప్రోలు మండలం

ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు



ఎన్నో ఏళ్లుగా శ్మశానవాటిక సమస్య అలానే ఉంది. ప్రభుత్వాలు మారినా పట్టించుకోవడం లేదు. వరద కారణంగా పంట పొలాలు నాశనమైపోవడంతో రెండు మూడు నెలలు కూలి పని దొరకని పరిస్థితి నెలకొంది.

– శొంటి కామేశ్వరరావు, చింతమోటు, భట్టిప్రోలు మండలం

బాధితులకు ఆపన్నహస్తం



పెనుమూడి పల్లెపాలెంలో బాధితులకు సాయం అందజేస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఆర్డీఓ హెలా షారోన్



భట్టిప్రోలు పెదలంక మధ్యగూడెంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాత

రేపల్లె రూరల్/భట్టిప్రోలు: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. పెనుమూడి పల్లెపాలెంలో వరద ప్రభావిత ప్రాంతాలను శుక్రవారం ఆయన సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. 127 కుటుంబాలకు ప్రభుత్వం అందించిన నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ హెలా షారోన్, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రావిఅనంతవరం గ్రామంలో పశుపోషకులకు టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ పశువుల దాణాను అందించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎం.హనుమంతరావు, రేపల్లె సహాయ సంచాలకులు బెల్లంకొండ నాంచారయ్య, మండల పశు వైద్యాధికారి ఎ.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెం, కృష్ణా జిల్లా ఆముదార్లంక గ్రామాల్లోని 600 మంది వరద బాధితులకు దాత వేములపల్లి రాఘవేంద్రరావు శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు.

ఆరోగ్య'శుద్ధి'రస్తు



ముంపు ప్రభావిత గ్రామాలలో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు. ఈ పనులను కలెక్టర్ వెంకట మురళి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. పెసర్లంకలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బందిని చిత్రంలో చూడొచ్చు. – కొల్లూరు